సాక్షి సంగారెడ్డి

7

మంగళవారం । 4 । జూన్ । 2024

పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్ క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ క్రాంతి తెలిపారు. పటాన్‌చెరు మండలం రుద్రారం.. గీతం వర్సిటీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఏఆర్‌ఓలతో ఆమె సమావేశమయ్యారు. ఈవీఎం కౌంటింగ్ సంబంధించి ప్రతి టేబుల్ ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. మైక్రో అబ్జర్వర్‌తో కలిసి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రౌండ్ ప్రకారం ఫలితాలు నమోదు చేస్తారన్నారు. పోస్టల్ బ్యాలెట్ సంబంధించి ప్రత్యేక హాల్ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సిబ్బంది అన్ని విధాలా సన్నద్ధం చేసినట్లు తెలిపారు. ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

144 సెక్షన్ అమలు

ఎస్పీ రూపేశ్



కౌంటింగ్ కేంద్రంలో ఎస్పీ రూపేశ్, అధికారులు

పటాన్‌చెరు టౌన్: కౌంటింగ్ కేంద్రం వద్ద 24 గంటలపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ రూపేశ్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్, స్థానిక పోలీస్ బలగాలతో మూడంచెల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులను కలిగి ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు.

క్షయ నివారణపై అవగాహన తప్పనిసరి

జిల్లా క్షయ నివారణ అధికారి రాజేశ్వరి



శిబిరంలో జిల్లా క్షయ నివారణ అధికారి రాజేశ్వరి తదితరులు

పటాన్‌చెరు టౌన్: క్షయ వ్యాధి నివారణపై అవగాహన తప్పనిసరి ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారిని రాజేశ్వరి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని పోస్కో ఇండియా పూణే ప్రాసెసింగ్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో క్షయవ్యాధి నివారణపై అవగాహనతో పాటు ఉచిత చాతి ఎక్స్ రే శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిబిరంలో దాదాపు 78 మందికి పరీక్షలు నిర్వహిస్తే వారిలో 11 మందిని అనుమానితులుగా గుర్తించామన్నారు. వారి నుంచి సేకరించిన తెమడను పటాన్‌చెరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి పంపించామన్నారు. కార్యక్రమంలో టీబీ అలర్ట్ ప్రతినిధులు డిస్ట్రిక్ ఫీల్డ్ ఆఫీసర్స్ కృష్ణ, శ్రీకాంత్, హెచ్ఆర్ మేనేజర్ అమిత్ పాల్గొన్నారు.

రాజీ మార్గయే శ్రేయస్కరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర



సంగారెడ్డి టౌన్: రాజీ మార్గంలో కేసులు తొందరగా పరిష్కారం చేసుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర అన్నారు. సోమవారం జిల్లా కోర్టులో ఆమె మాట్లాడుతూ, ఈనెల 8న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేసులను ఎక్కువ సంఖ్యలో రాజీ మార్గాన పరిష్కరించడానికి న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ అధికారులు సహకరించాలని మోటార్ వాహన, ప్రమాద నష్టపరిహార కేసులు, ఆస్తి తగాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, వివిధ రకాల కేసులను పరిష్కరించుకోవచ్చని లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్

జహీరాబాద్ టౌన్: రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ పాఠశాలలు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్, ట్యూషన్, హాస్టల్ ఫీజులతో పాటు పుస్తకాల కోసం వేలకు వేలు దండుకుంటున్నాయని మండిపడ్డారు. అలాగే రాష్ట్రంలో పేదలకు విద్య అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవస్థలో ప్రక్షాళన చేపట్టాలన్నారు.

గెలుపెవరిదో..?

నేడే లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

- మరికొన్ని గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం..
- ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై నెలకొన్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది. మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లో తెలిపోతుంది. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. ఆయా పార్టీల జాతీయ, అగ్రనేతలు, రాష్ట్ర అధినాయకత్వం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించగా గతనెల 13న పోలింగ్ జరిగింది. ఈ ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది.

రుద్రారంలో జహీరాబాద్ కౌంటింగ్

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జరగనుంది. జహీరాబాద్ బరిలో మొత్తం 19 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇక్కడ మొత్తం 16.41 లక్షల మంది ఓటర్లు ఉండగా, గత నెల 14న జరిగిన పోలింగ్ ప్రక్రియలో 12.25 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పోస్టల్ ఓట్లు 10,832 ఉండగా, సర్వీసు ఓటర్లు 198 ఉన్నాయి. మొత్తం 74.63 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.



గీతం వర్సిటీలో కౌంటింగ్‌కు సిద్ధం చేసిన టేబుళ్లు

మధ్యాహ్నం తర్వాత ఫలితం

ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఫలితంపై మధ్యాహ్నం తర్వాత స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఈ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఒక్కో అసెంబ్లీ ఓట్లను ఒక్కో గదిలో లెక్కించనున్నారు. ఒక్కో గదిలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ అబ్జర్వర్, కౌంటింగ్ ఆఫీసర్, కౌంటింగ్ అసిస్టెంట్‌లు ఉంటారు. ప్రత్యేక ఏర్పాటు చేసిన బృందాలు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించి క్రోడీకరిస్తారు. ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. లెక్కింపు పూర్తయిన తర్వాత ఫలితాలను ప్రకటిస్తారు. పోస్టల్ ఓట్లతో పాటు, సాధారణ ఓట్లను కూడా ఒకేసారి లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ క్రాంతి ప్రకటించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఈ మేరకు అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేకంగా పాసులు జారీ చేశారు. భద్రత ఏర్పాట్లను ఎస్పీ చెన్నూరి రూపేష్ పర్యవేక్షిస్తున్నారు.

ఈ సెగ్మెంట్లలో ఫలితం ఆలస్యం

ఇతర అసెంబ్లీ సెగ్మెంట్లతో పోల్చితే అందోల్, జహీరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఫలితాలు చివరకు వచ్చే అవకాశాలున్నాయి. పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉండటంతో లెక్కించాల్సిన ఈవీఎంల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. దీంతో ఈ రెండు సెగ్మెంట్లలో ఫలితం కాస్త ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి. ముందుగా జుక్కల్, కామారెడ్డి ఫలితాలపై స్పష్టత రానుంది.

మెదక్, నర్సాపూర్‌లో లెక్కింపు

మెదక్‌జోన్/నర్సాపూర్: మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. మెదక్ పార్లమెంట్ పరిధిలో 18,28,210 ఓటర్లు ఉండగా 13,72,894 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల బరిలో 44 మంది అభ్యర్థులు నిలిచారు. కాగా పోలింగ్ పూర్తికాగానే అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ బాక్సులను నర్సాపూర్‌లోని స్ట్రాంగ్‌రూంల్లో భద్రపరిచి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బీవీఆర్‌ఐటీలో మెదక్, సిద్దిపేట, గజ్వేల్, నర్సాపూర్, దుబ్బాక సెగ్మెంట్లకు సంబంధించిన కౌంటింగ్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో సంగారెడ్డి, పటాన్‌చెరు సెగ్మెంట్ల లెక్కింపు జరుగనుంది.

అసెంబ్లీ సెగ్మెంట్	మొత్తం ఓట్లు	పోలైనవి	పోలింగ్ కేంద్రాలు	లెక్కించే రౌండ్‌లు
జుక్కల్	2,02,287	1,53,855	255	19
బాన్సువాడ	1,96,826	1,51,516	258	19
ఎల్లారెడ్డి	2,23,027	1,72,928	270	20
కామారెడ్డి	2,55,007	1,82,325	266	19
నారాయణఖేడ్	2,37,241	1,72,508	296+2	22
అందోల్	2,50,860	1,97,320	313	23
జహీరాబాద్	2,75,562	2,00,597	313	23

పాలనంతా కేంద్రీకరణే!

తహసీల్దార్ల అధికారాలు ధరణిలో కలెక్టర్లకు ఇచ్చారు


- భూ సమస్యల పరిష్కారం కోసం సామాన్యులు కలెక్టరేట్‌కు..
- కొత్త జిల్లాలతో ప్రజలకు తగ్గిన దూరాభారం
- అదనపు కలెక్టర్లకు నిర్దిష్టమైన జాబ్ చార్ట్‌లేదు
- 'సాక్షి'తో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వి.నాగిరెడ్డి



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: దశాబ్ద కాలంలో తెలంగాణలో ప్రభుత్వ పాలన వికేంద్రీకరణ పేరుతో కేంద్రీకరణే జరిగింది. ధరణి పోర్టలే ఇందుకు ఉదాహరణ. భూ సమస్యలు మండల స్థాయి అధికారుల వద్దే పరిష్కారం కావాల్సిన ఉండగా కలెక్టరేట్‌ల చుట్టూ రైతులు తిరగడమే ఇందుకు ప్రత్యక్ష తార్కాణం. ఈ కొత్త చట్టం ద్వారా తహసీల్దార్ల అధికారాలను కలెక్టర్లకు అప్పగించి పాలన కేంద్రీకృతం చేసినట్లయింది. బయటకు వికేంద్రీకరణగా కనిపించినప్పటికీ.. ఫంక్షనింగ్ అంతా కేంద్రీకృతమైంది. అని ప్రముఖ బ్యూరోక్రాట్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వి.నాగిరెడ్డి తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ తర్వాత రాష్ట్రంలో ఈ పదేళ్ల పాలనలో జరిగిన పరిణామాలపై 'సాక్షి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ఎన్నికల కమిషనర్‌గా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా, కడప జిల్లా కలెక్టర్‌గా, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా వివిధ హోదాల్లో పనిచేసి సుదీర్ఘ పాలన అనుభవం ఆయన సొంతం.

➡ తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ పరిపాలనలో వచ్చిన మార్పులేంటి?

పదేళ్లలో చెప్పుకోదగిన మార్పులేవీ జరగలేదు. కానీ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థల పాలనలో మార్పులు వచ్చాయి. పంచాయతీలతో పాటు, మున్సిపాలిటీలకు సంబంధించి కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయి. సర్పంచ్‌లను, మున్సిపల్ పాలకవర్గాలపై చర్యలు తీసుకునే అధికారాలు కలెక్టర్లకు ఇవ్వడమంటే పాలన కేంద్రీకృతం చేసినట్లే. పైగా ఈ కొత్త చట్టాలతో పంచాయతీలు, మున్సిపాలిటీలకు పవర్స్, ఫండ్స్, ఫంక్షనింగ్ తగ్గించినట్లయింది.



➡ కొత్త మండలాలతో సామాన్యులకు సౌలభ్యం?

అక్కడక్కడ కొన్ని కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. పాలన పరంగా అప్పుడప్పుడు కొత్త మండలాను ఏర్పాటు చేస్తుంటారు. ఇలా మండలాలు కొత్తగా అందుబాటులోకి రావడం సామాన్యులకు కొంత దూరభారం తగ్గడంతో పాటు, స్థానికంగా కొంత మేలు జరుగుతోంది. మండల స్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కారం అయితే బాగుంటుంది.

స్థానిక సంస్థలకు నిర్ణీత గడువు లోగా ఎన్నికలు నిర్వహించే అధికారం గతంలో ఎన్నికల సంఘానికి ఉండేది. కొత్త చట్టాల ప్రకారం ఈ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలనే నిబంధన పెట్టారు. ఇది కూడా పాలన కేంద్రీకృతం అయిందనే చెప్పుకోవచ్చు.

➡ జిల్లాల సంఖ్యను పెంచారు.. పాలనా పరమైన ప్రయోజనాలు?

జిల్లాల సంఖ్య పెరగడం వల్ల ప్రజలకు దూరాభారం తగ్గింది. కలెక్టర్లుగా, అదనపు కలెక్టర్లుగా నియమిస్తున్న కొందరు అధికారులకు సుమారు 16 రెవెన్యూ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండటం లేదు. ఈ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరం. గతంలో ఆర్డీఓగా రెండేళ్ల అనుభవం ఉంటే కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చేవారు. దీంతో సదరు అధికారికి రెవెన్యూ చట్టాలపై చాలా వరకు అవగాహన వచ్చేది. ఇలాంటి నిబంధనలేవీ లేకుండానే కలెక్టర్ల పోస్టింగ్‌లు ఇస్తున్నారు.

➡ జాయింట్ కలెక్టర్ స్థానంలో కొత్తగా అదనపు కలెక్టర్ల పోస్టులు వచ్చాయి?

జిల్లాకు ఒక అదనపు కలెక్టర్ల పోస్టులు వచ్చాయి. ఇందులో ఒకరు రెవెన్యూ విభాగానికి, మరొకరు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లుగా నియమిస్తున్నారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లకు ఇంకా ఓ నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ లేదు. దీన్ని బట్టి చూస్తే ఈ పోస్టుల ఎంత మేరకు పాలన సౌలభ్యాన్ని పెంచాయనేది అర్థం చేసుకోవచ్చు.

రైతులకు ఇబ్బందులు కలగవద్దు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: వానాకాలం ప్రారంభమవుతున్నందున రైతులకు అవసరం అయ్యే విత్తనాలు, పురుగు మందులు ఫర్టిలైజర్ దుకాణాల్లో సిద్ధంగా ఉండేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సూచించారు. మనూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా, అధిక ధరలకు విక్రయాలు జరగకుండా అధికారులు చూడాలని సూచించారు. ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీలు చేస్తూ రైతులకు అవసరం అయ్యే విత్తనాలు సిద్ధంగా ఉన్నాయో లేవో చూసుకొని అవసరం మేరకు రెడీ చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ కాంట్రాక్టర్లు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటే ఏబీ స్విచ్‌లు సరఫరా అయినా వాటిని కాకుండా బయట నాణ్యతలేనివి కొనుగోలు చేసి కొన్ని స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయించాలని ఏఈ అశోక్‌రెడ్డిని ఆదేశించారు. మనూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోరానికి అవసరం ఉన్న సభ్యులు హాజరు కాకపోవడంతో సభ వాయిదావేశారు. ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర రాజనర్సింహ

జహీరాబాద్: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం జహీరాబాద్‌లో సన్‌రూహి ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలు పదేళ్ల పాటు కేంద్రంలో బీజేపీకి అధికారం ఇచ్చారని, ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారన్నారు. దీంతో కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ ప్రజలు పట్టం కట్టిన విషయాన్ని గుర్తుచేశారు. సన్‌రూహి యాజమాన్యం జహీరాబాద్‌లో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గుండె జబ్బులతోపాటు అన్ని రకాల వైద్యసేవలు నిపుణుల ఆధ్వర్యంలో అందనున్నాయన్నారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైనప్పుడు రోగులు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందని, ఇక ఈ ఆస్పత్రిలోనే వైద్యం పొందవచ్చన్నారు. మెరుగైన వైద్యసేవలందించి ప్రజల నుంచి ప్రశంసలు అందుకోవాలన్నారు. అంతకు ముందు ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్ రావులు ఆస్పత్రిలోని పలు విభాగాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఆస్పత్రి ప్రతినిధులు రవీందర్ పాటిల్, సంజీవ్ కుమార్, ఆయా పార్టీల నాయకులు వై.నరోత్తం, తన్వీర్, సిద్దన్న పాటిల్, హన్మంత్‌రావు పాటిల్ పాల్గొన్నారు.



మంత్రి దామోదర్ రాజనర్సింహను సత్కరిస్తున్న వైద్యులు

బాగారెడ్డి సేవలు మరువలేనివి



సభలో మాట్లాడుతున్న పాటిల్

జహీరాబాద్: ఉమ్మడి మెదక్ జిల్లాకు మాజీమంత్రి దివంగత ఎం.బాగారెడ్డి అందించిన సేవలు ఎనలేనివని బీజేపీ జహీరాబాద్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. సోమవారం పట్టణంలో బాగారెడ్డి వర్ధంతిని జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాటిల్ మాట్లాడుతూ, జిల్లాకే కాకుండా రాష్ట్రానికి కూడా బాగారెడ్డి ఎనలేని సేవలు చేశారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన బలంగా వాదించారని గుర్తుచేశారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, బాగారెడ్డి తనయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు రామకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, సద్రుద్దీన్‌గౌరి, శ్రీనివాస్‌గౌడ్, శశికాంత్, జి.భాస్కర్, జనార్దన్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఎం.సుభాష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు ప్రయోజనకరం

డీసీఎంఎస్ జిల్లా చైర్మన్ శివకుమార్

జహీరాబాద్ టౌన్: వేసవి శిబిరాల వల్ల పిల్లలకు అనేక విధాలా ప్రయోజనం కలుగుతుందని డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ పేర్కొన్నారు. రాజు డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డ్యాన్స్ మాస్టర్ రాజు పట్టణంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో ప్రతిభ కనబర్చిన పిల్లలకు సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శివకుమార్ మాట్లాడుతూ, వేసవిలో పిల్లలకు బోర్ కొడుతుందని తల్లిదండ్రులు టెన్షన్ పడుతుంటారన్నారు. శిబిరాలకు పంపిస్తే కొత్త విషయాలు నేర్చుకుంటారన్నారు. అంతే కాదు ఈ జ్ఞాపకాలను పిల్లలు గుర్తుంచుకుంటారన్నారు. శిబిరం విజయవంతంగా నిర్వహించిన రాజు మాస్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

నైరుతి ఆగమనం.. రైతుల సంబురం



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

నైరుతి ఆగమనంతో వానలు కురుస్తున్నాయి. దీంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వారు వ్యవసాయ పనులను ప్రారంభిస్తున్నారు. ముందుగా పత్తి సాగు చేపట్టేందుకు అవసరమైన దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. వరి విషయానికొస్తే అప్పటికే పలువురు దుక్కులు దున్ని పచ్చిరొట్టె విత్తనాలను చల్లుతున్నారు. మేలైన పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.1800లు వెచ్చించి బ్లాక్‌లో కొంటున్నట్లు రైతులు చెబుతున్నారు.

పుల్‌కల్(అందోల్):

కూల్.. కూల్

నారాయణఖేడ్: ఈ ప్రాంతంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. సిర్గాపూర్ మండలంలో 31.8 మి.మీ, నాగల్‌గిద్ద లో 21.4, ఖేడ్ లో 20.6, నిజాంపేట్‌లో 10, కల్హేర్‌లో 9.6, మనూర్‌లో 7.2 మిమీలుగా నమోదైంది. తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనాలకు వర్షం ఎంతో ఊరట ఇచ్చింది. వర్షంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఇక రైతులు.. విత్తనాలు, ఎరువులపై దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో సాగునీటి వనరులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కేవలం అధిక శాతం రైతులు వర్షాధారంపై ఆధారపడుతుంటారు. ఈ ఏడాది సకాలంలోనే వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంటుండటంతో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో సందడి నెలకొంది.

క్లుప్తంగా

నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న మాణిక్

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని బడంపేట నర్సింలు మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్, సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు కరణం రవికుమార్ డిమాండ్ చేశారు. సామాజిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. మే 18న బడంపేట నర్సింలు కొంత మంది దుర్మార్గులు కొట్టి చంపారన్నారు. మృతుడు నర్సింలు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. లేనియెడల నర్సింలుకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు అశోక్, మహేశ్, సమతా సైనిక్‌దళ్ నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, రాములు, దిలీప్, సుభాష్, మచ్చెందర్, రాకేశ్, డిక్కి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ చేసి.. అడవిలో కాల్చేసి



కాల్చేసిన వైర్లు

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తు తెలియని వ్యక్తులు బోరు బావుల వద్ద నుంచి దొంగిలించిన కేబుల్ వైర్లను అడవిలో కాల్చేసి అందులో నుంచి రాగి తీగను తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి నానుతండాకు చెందిన 15 మంది రైతుల బోరుబావుల వద్ద శనివారం అర్ధ రాత్రి కేబుల్ వైర్లు ఎత్తుకెళ్లారు. అలాగే గ్రామ పంచాయతీ బోరుబావి కేబుల్ సైతం చోరీ చేశారు. దొంగిలించిన కేబుల్ వైర్లను మండల పరిధి చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో కాల్చేసి అందులో నుంచి రాగి వైరును ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. సోమవారం అటవీ ప్రాంతంలో కాల్చేసిన కేబుల్ వైర్లను పలువురు గుర్తించారు. ఈ విషయంపై 15 మంది బాధిత రైతులు శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనారోగ్య సమస్యతో బాధపడుతూ..

వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మీ నగర్ ఫేస్–2కు చెందిన శ్రీమన్నారాయణ(63) ఆరు నెలల నుంచి అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని మాత్రలను వాడుతున్నాడు. ఎంతకూ తగ్గకపోవడంతో భార్యతో చెబుతూ బాధపడేవాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి స్కూటీ తీసుకొని వెళ్లిన శ్రీమన్నారాయణ తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వెతుకుతున్న క్రమంలో వడకపల్లి సమీపంలో ఓ వెంచర్ వద్ద చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనారోగ్య సమస్యతోపాటు, డిప్రెషన్ కు లోనై జీవితం పై విరక్తి చెంది తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య పద్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బాలుడు అదృశ్యమైన ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బీహార్ రాష్ట్రానికి చెందిన లలితా దేవి కుటుంబంతో పటాన్‌చెరు గొల్లబస్తీలో ఉంటున్నారు. కరివేపాకు చెట్టు విషయంలో ఇంటి వెనుకాలో ఉన్న వ్యక్తి, లలితా దేవి కుమారుడు సత్యం (10) మే 31వ తేదీన గొడవపడ్డారు. అతడు సైకిల్ తీసుకొని తిరిగి ఇవ్వలేదు. దీంతో బాలుడు అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బాలుడి కోసం స్నేహితుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో బాలుడి తల్లి లలితా దేవి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాక్‌పాట్ కొట్టేదెవరో?

జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై నేతల్లో ఉత్కంఠ

- బీబీ పాటిల్ హ్యాట్రిక్ కొట్టేనా..!
- సురేశ్ శెట్కార్‌కు రెండో అవకాశం దక్కేనా!
- గాలి అనిల్‌కుమార్ గట్టెక్కేనా
- మరికొన్ని గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి జాక్‌పాట్ కొట్టే దెవరో అని ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఎగిరేది కాషాయమా లేక కాంగ్రెస్, గులాబీ జెండానా అనే విషయంలో ఆయా పార్టీల అభిమానులు లెక్కలు వేసుకుంటున్నారు. అంతే కాకుండా చోటా మోటా నేతలు బెట్టింగ్‌లు సైతం కాస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరికొన్ని గంటల్లో ఫలితం వెలువడనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, నేతల్లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. – జహీరాబాద్

అసెంబ్లీ సెగ్మెంట్	పోలైన ఓట్లు	శాతం
జహీరాబాద్	2,00,597	72.80
అందోల్	1,91,320	76.27
నారాయణఖేడ్	1,72,508	72.71
కామారెడ్డి	1,82,325	71.50
ఎల్లారెడ్డి	1,72,928	77.54
బాన్సువాడ	1,51,516	76.98
జుక్కల్	1,53,855	75.83
మొత్తం	12,25,049	74.63



2008లో కొత్తగా ఏర్పడిన జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి నాలుగో పర్యాయం ఎన్నికలు జరిగాయి. గత మూడు ఎన్నికల్లో ఇంత మేర ఉత్కంఠ పరిస్థితి కనిపించలేదని పలువురు పేర్కొంటున్నారు. గత ఎన్నికలతో పోల్చి చూస్తే ఈ ఎన్నికలు విభిన్నంగా సాగాయి. మూడు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ప్రధాన పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే కొనసాగింది. ఈ ఎన్నికల్లో మాత్రం బీజేపీ అనూహ్యంగా పుంజుకొని ప్రధాన పోటీదారుగా అవతరించింది. ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి చూస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యే ప్రధాన పోటీ సాగినట్లు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీకి 8 నుంచి 12 స్థానాలు దక్కవచ్చని, కాంగ్రెస్‌కు సైతం 8 నుంచి 10 స్థానాలు దక్కవచ్చని వెల్లడించడంతో జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందో అనే ఆసక్తి ప్రతీ ఒక్కరిలో కనిపిస్తోంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ స్థానాలు, సంగారెడ్డి జిల్లా పరిధిలోని జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. పార్లమెంట్ పరిధిలో మొత్తం 16,41,410 ఓట్లు ఉండగా, 12,25,049 ఓట్లు పోల్ అయ్యాయి. 74.63 శాతం పోలింగ్ నమోదైంది.

హ్యాట్రిక్‌పై బీబీ పాటిల్ గురి..



వరుసగా రెండు పర్యాయాలు జహీరాబాద్ పార్లమెంట్ పీఠం దక్కించుకున్న బీబీ పాటిల్ మరో మారు గెలుపొంది హ్యాట్రిక్ కొడతారా అనే విషయమై ప్రజల్లో చర్చ సాగుతోంది. రెండు పర్యాయాలు బీఆర్ఎస్ తరఫున గెలుపొందిన బీబీ పాటిల్ ఈ ఎన్నికల్లో మాత్రం బీజేపీలోకి వెళ్లి టికెట్ దక్కించుకొని పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన బీబీ పాటిల్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ శెట్కార్‌పై 1,44,631 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో సైతం బీబీ పాటిల్ బీఆర్ఎస్ తరఫున పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మదన్‌మోహన్‌రావుపై కేవలం 6,229 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో సైతం ప్రధాని మోదీ గాలిలో భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమనే ధీమాతో బీబీ పాటిల్, పార్టీ శ్రేణులు ఉన్నాయి.

శెట్కార్ రెండోసారి గెలిచేనా..



జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి రెండో పర్యాయం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సురేశ్ శెట్కార్ రెండోసారి విజయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో అందోల్, నారాయణఖేడ్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలు కాంగ్రెస్ పార్టీ చేతిలో ఉన్నాయి. దీంతో సురేశ్ శెట్కార్ గెలుపుపై ధీమాతో ఉన్నారు. 2009లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానం కొత్తగా ఏర్పాటైంది. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన సురేశ్ శెట్కార్ బీఆర్ఎస్ అభ్యర్థి యూసూఫ్‌అలీపై 19,407 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో బీబీ పాటిల్ చేతిలో ఓటమిపాలయ్యారు. మరో మారు టికెట్ లభించడంతో రెండోసారి విజయం కోసం ఎదురుచూస్తున్నారు.

'గాలి' వీచేనా?



ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ వరుసగా రెండు పర్యాయాలు అధికారంలో ఉండగా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఢీలా పడ్డాయి. ఎంపీగా పోటీ చేసేందుకు పార్టీ నేతలు ఎవరూ ఉత్సాహం చూపలేదు. దీంతో పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన గాలి అనిల్‌కుమార్ పోటీకి ఆసక్తి చూపడంతో బీఆర్ఎస్ అధిష్టానవర్గం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. జహీరాబాద్, బాన్సువాడ అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఆయా నియోజకవర్గాల్లో భారీ మెజార్టీ సాధిస్తామనే ధీమాతో పార్టీ శ్రేణులు ఎన్నికల్లో ప్రచారం సాగించాయి.

చంపుతామని బెదిరిస్తున్నారు

ప్రజావాణిలో ఓ బాధితుడి ఫిర్యాదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: నా భూమిని కబ్జా చేసి ఆ భూమిలోకి వస్తే చంపుతానని బెదిరిస్తున్నారని చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామానికి చెందిన ముంద్రాతి సత్యనారాయణ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బాలస్వామి ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామానికి చెందిన ముంద్రాతి సత్యనారాయణ తనకు గ్రామ శివారులోని సర్వే నంబర్‌లో 1146/31 లో 20 గుంటల భూమి ఉన్నట్లు తెలిపారు. ఈ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేసి అందులోకి రానివ్వడం లేదని తెలిపారు. ఇదేమిటని ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. అలాగే టేక్మాల్ మండలం సంగ్యాతాండ వెంకటాపూర్ చెందిన కేతావత్ వసంత్ కుమార్ 2024 ఫిబ్రవరి 24వ తేదీన తన తమ్ముడు కరెంట్ షాక్ తో చనిపోయాడని తెలిపారు. తన తమ్ముడి మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని తమకు నష్ట పరిహారం ఇప్పించాలని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ ఫిర్యాదుదారులకు చట్టప్రకారం తగిన న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

హైనా దాడిలో జీవాలు మృతి



పంచనామా నిర్వహిస్తున్న పశువైద్యాధికారి

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో జీవాలు మృతి చెందిన ఘటన దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామ శివారుపల్లె జెల్లగూడెంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు మందెపల్లి శ్రీనివాస్ కథనం మేరకు.. రోజు మాదిరిగానే జీవాలను మేపుకొని రాత్రి దొడ్డిలోకి పంపి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. సోమవారం ఉదయం దొడ్డి వద్దకు వెళ్లి చూడగా మూడు జీవాలు మృతి చెందడంతోపాటు 20 జీవాలు తీవ్రంగా గాయపడి ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. జీవాల మందపై హైనా దాడి చేసి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశాడు. మృతి చెందిన జీవాలను మద్దూరు పశువైద్యాధికారి హరికిషన్ సందర్శించి పంచనామా నిర్వహించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె..

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని కొంతాన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఆకుల నరేశ్‌కు చెందిన పాడి గేదెలను రోజు మాదిరిగా వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లగా బోరుబావి వద్ద తేలిన విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొని బోరున విలపించాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మెదక్ మండలం రాజ్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ శివకుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన సున్నం వెంకటయ్య(46) పొలంలో సోమవారం సాయంత్రం బోరు మోటార్‌కు కరెంటు సరఫరా కాకపోవడంతో స్టార్టర్ డబ్బాలో వైరు మరమ్మతు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని మెదక్ రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ గంగరాజు

దుబ్బాకటౌన్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో సోమవారం చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన గూడూరి రంగయ్య (65) కూలీ పని చేసుకుంటూ భార్యతో జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో కూలీ పని చేసుకోవడానికి లచ్చపేట డబుల్ బెడ్ రూమ్‌ల నుంచి మెయిన్ రోడ్డు వైపు సైకిల్ పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోడల్ స్కూల్ నుంచి దుబ్బాక వైపునకు అతి వేగంగా వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో రంగయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. రంగయ్య భార్య శివకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జల్సాల కోసమే చైన్ స్నాచింగ్

సిద్దిపేట ఏసీపీ మధు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మధు

చిన్నకోడూరు(సిద్దిపేట): చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్ జిల్లాల దొంగను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. ఆయన కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమ్మం రాకేశ్ జల్సాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించాలుకున్నాడు. ఇందుకోసం చైన్ స్నాచింగ్ మొదలు పెట్టాడు. సోమవారం తెల్లవారుజామున మండల పరిధిలోని రామునిపట్ల వద్ద చిన్నకోడూరు పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో బైక్‌పై సిద్దిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న యువకుడు పోలీసులను చూసి భయాందోళనకు గురువుతున్నాడు. వెంటనే అతడిని తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభించాయి. అనుమానం వచ్చి విచారించగా అసలు విషయాన్ని అంగీకరించాడు. మే నెల 30 న రాత్రి 8 గంటల సమయంలో రామునిపట్ల వద్ద గజ్జల దేవమ్మ, సత్తయ్య దంపతులు బైక్‌పై చిన్నకోడూరు వెళ్తున్నారు. వారిని వెంబడించి మహిళ మెడలో నుంచి చైన్ ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అంతకుముందు నిందితుడు హుస్నాబాద్ నుంచి మడద గ్రామం వెళ్లే రోడ్డులో ఇద్దరు మహిళలు, మరో వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా మంగళసూత్రం, అలాగే హుస్నాబాద్ నుంచి కొండాపూర్ వెళ్లే రోడ్డులో భార్యాభర్తలు బైక్‌పై వెళ్తుండగా మహిళ మెడలో నుంచి చైన్ లాక్కెళ్లినట్లు తెలిపాడు. చిన్నకోడూరు మండలం చర్ల అంకిరెడ్డి పల్లి గ్రామంలో ఇంటి వద్ద నిలబడి ఉన్న మహిళ మెడలో నుంచి బంగారు చైన్ తెంపుకొని పారిపోయానని పేర్కొన్నాడు. నిందితుడి వద్ద నుంచి 5 తులాల బంగారు ఆభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ మధు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఎర్రారంలో రెచ్చిపోయిన దొంగలు
- ఒకే రోజు 8 ఇళ్లలో చోరీ
- 11 తులాల బంగారం, 130 తులాల వెండి, రూ. 2.55 లక్షల నగదు అపహరణ



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

వట్‌పల్లి(అందోల్): తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుంటూ ఆదివారం రాత్రి అందోలు మండల పరిధిలోని ఎర్రారం గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. ఒకే రోజు 8 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయిన రత్నమ్మ కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లడంతో తాళం పగులగొట్టి బీరువాలోని 5 తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.15 వేలు నగదు, తలారీ భాగమ్మ ఇంట్లో 50 తులాల వెండి, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే, ఎరుకుల లక్ష్మయ్య కుటుంబం హైదరాబాద్ ప్రాంతంలో ఉపాధి నిమిత్తం వెళ్లింది. ఇంట్లోని పెట్టెలో దాచిన రూ.1.80 లక్షల నగదు, తులం బంగారం దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. అలాగే, చాకలి పోచమ్మ ఇంటి తాళాలు పగులగొట్టి 20 తులాల వెండి ఆభరణాలు, శివశంకర్ రెడ్డి ఇంట్లోకి వెనుకభాగం నుంచి గోడదూకి బీరువాలోని రూ.20 వేల నగదు అపహరించారు. వడ్ల పార్వతమ్మ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లగా, ఇంటి తాళాలు పగులగొట్టి 4 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.25వేల నగదు, ఈరగల్ల లక్ష్మి ఇంట్లో 10 తులాల వెండి, రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్, సీఐ అనీల్‌కుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీమ్ ఇన్‌చార్జి చిట్టిబాబు నేతృత్వంలో దొంగతనాలు జరిగిన ఇళ్లల్లో వేలిముద్రలు సేకరించారు. ఈ దొంగతనాలు స్థానికులే చేసి ఉంటారన్న అనుమానాల్ని జోగిపేట సీఐ అనీల్‌కుమార్ వ్యక్తం చేశారు. దొంగలను తప్పకుండా పట్టుకుంటామన్నారు.

పాలిసెట్‌లో మెరిసిన విద్యార్థులు

- ఎంపీసీలో మూడు, బైపీసీలో మూడు రాష్ట్ర స్థాయి ర్యాంకులు
- అరవింద్‌కు రెండు విభాగాల్లో ర్యాంక్

నంగునూరు(సిద్దిపేట): పాలిసెట్ ఎంట్రెన్స్‌లో జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఆరు ర్యాంక్‌లు సాధించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన చింతోజు అరవింద్ ఎంపీసీ, బైపీసీ రెండు విభాగంలోనూ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటాడు. ఇటీవల నిర్వహించిన పాలిసెట్ ఎంట్రెన్స్‌కు జిల్లా వ్యాప్తంగా 2,884 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో బాలికలు 1,478, బాలురు 1,406 మంది ఉన్నారు. బైపీసీ, ఎంపీసీ విభాగాల్లో 77.64 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. చింతోజు అరవింద్ బైపీసీ విభాగంలో 10వ ర్యాంక్, ఎంపీసీ విభాగంలో 12 ర్యాంక్ సాధించారు.

ఐఐటీ సాధిస్తా..



పాలిసెట్ ఎంట్రెన్స్‌లో ఎంపీసీ తోపాటు నాలుగో పార్టులోని బయాలజీ రాయడంతో రెండు విభాగాల్లో ర్యాంక్ వచ్చింది. మంచి ర్యాంక్ రావడం ఎంతో సంతోషంగా ఉంది. పదో తరగతి పరీక్షల్లో పది జీపీఏ సాధించాను. పాలిటెక్నిక్ పూర్తి చేసి ఐఐటీ సీటు సాధిస్తా.

– చింతోజు అరవింద్, సిద్దిపేట



దాసరి శ్రీజ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన దాసరి శ్రీజ పాలిసెట్‌లో రాష్ట్ర 140 వ ర్యాంకు (అగ్రికల్చర్), 221వ ర్యాంకు(ఇంజనీరింగ్)లో సాధించింది. స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 10వ తరగతి చదివిన శ్రీజ పదిలో 9.8 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి సమ్మయ్యతో ఫోన్‌లో మాట్లాడగా ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలో ఎంపీసీలో చేరినట్లు పేర్కొన్నాడు.

బైపీసీలో 145, ఎంపీసీలో 266 ర్యాంక్



సాత్విక్

మద్దూరు(హుస్నాబాద్): సోమవారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో మండలానికి చెందిన విద్యార్థి ఉత్తమ ఫలితాలతో రాణించాడు. మద్దూరు మండల పరిధిలోని లద్నూర్ గ్రామానికి చెందిన వలబోజు సత్యనారాయణ, గీతాదేవిల కుమారుడు సాత్విక్ ఎంబైపీసీలో 145వ ర్యాంక్, ఎంపీసీలో 266వ ర్యాంక్ సాధించాడు. దీంతో సాత్విక్‌ను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సంగారెడ్డి విద్యార్థుల సత్తా

సంగారెడ్డి టౌన్: పాలిటెక్నిక్ విడుదలైన ఫలితాలలో సంగారెడ్డి విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి సత్తా చాటారని పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. సంగారెడ్డికి చెందిన ఎంపీసీలో 207వ ర్యాంక్ వడ్ల అనూశ్, 459వ ర్యాంకు హరిచంద్ర వాషిని, 465 కుమ్మరి ప్రణీత్, బైపీసీలో 279వ ర్యాంకు హరిచంద్ర వాహిని, 362వ ర్యాంకు నవ్య యోగ శ్రీ సాధించినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో 82వ ర్యాంకు



హర్షవర్ధన్

దుబ్బాక: దుబ్బాక పట్టణానికి చెందిన మంచె చంద్రం కుమారుడు హర్షవర్ధన్ సోమవారం విడుదలైన పాలిసెట్ ఎంపీసీ విభాగంలో స్టేట్ 82 వ ర్యాంక్ ను సాధించాడు. హర్షవర్ధన్ తండ్రి చంద్రం టైలరింగ్ చేస్తుండగా తల్లి మమత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. చదువులో బాగా చురుకుగా ఉంటాడని, టెన్త్‌లో సైతం 9.5 జీపీఏ సాధించాడని ఇప్పుడు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌లో స్టేట్‌లో మెరుగైన ర్యాంకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు.

జక్కాపూర్ విద్యార్థుల ప్రభంజనం

సిద్దిపేటరూరల్: జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాలిసెట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉమ్మడి జిల్లా పరీక్షల కార్యదర్శి షౌకత్ అలీ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఏర్వ హన్సిక 447 ర్యాంకు, దుబ్బాక జస్వంత్ 596వ ర్యాంకు, సిరిసిల్ల సమీక్ష 805వ ర్యాంకు, మరో ఇద్దరు 749, 1,018 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలు షురూ..

- ఆరో తరగతికి దరఖాస్తులు ప్రారంభం
- సిద్దిపేట జిల్లాలో 22 పాఠశాలలు



దుబ్బాక కస్తూర్బా పాఠశాల

దుబ్బాకటౌన్: పేద, వెనుకబడిన బాలికలకు విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను (కేజీబీవీ) ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 1 నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

ఆరో తరగతిలో..

జిల్లాలో మొత్తం 22 కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఆర తరగతికి 40 మంది చొప్పున ప్రవేశం కల్పిస్తారు. ఇప్పటికే దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. అలాగే 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఏమైనా ఖాళీలు ఉంటే ప్రవేశాలు కల్పిస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి అడ్మిషన్లు తీసుకుంటున్నారు.

అన్ని వసతులతో..

కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు వసతితో కూడిన విద్య అందిస్తారు. పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందజేస్తారు. భవిష్యత్‌లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పొందేలా కుట్లు, అల్లికలతోపాటు ఇతర అంశాలను నేర్పిస్తున్నారు. అలాగే ఆంగ్లమాధ్యమంలో బోధన చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



నాణ్యతతో కూడిన విద్య, వసతి గృహం అందుబాటులో ఉన్నందున గ్రామీణ ప్రాంత విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. భవిష్యత్‌లో విద్యార్థునులకు ఉపాధి కల్పించేలా వృత్తి విద్య కోర్సులు, కుట్లు, అల్లికల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం.

– స్వాతి, దుబ్బాక కేజీబీవీ ప్రిన్సిపాల్

దరఖాస్తు ఇలా..

కస్తూర్బా విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించి మొదటగా తల్లిదండ్రులు లేని విద్యార్థినులకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. తర్వాత మిగిలిన విద్యార్థినుల ప్రవేశాలను నమోదు చేసుకుంటున్నారు. దరఖాస్తుకు 5వ తరగతి వరకు చదువుకున్న బోనోఫైడ్, టీసీ, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటోలు జత చేయాలి.